వైద్య పరీక్షలు గగనం

ప్రభుత్వ ఈఎన్టీ ఆస్పత్రిలో ఇదీ పరిస్థితి

- రక్త, హెచ్ఐవీ మొదలైన పరీక్షలు అందుబాటులో లేని వైనం
- కేజీహెచ్, ఇతర ఆస్పత్రులకు వెళ్లాల్సిందే..
- ఇబ్బందులు పడుతున్న రోగులు



పెదవాల్తేరులోని ప్రభుత్వ ఈఎన్టీ ఆస్పత్రి

బీచ్‌రోడ్డు: పేరుకే బోధనాస్పత్రి.. సౌకర్యాల్లో మాత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటే తక్కువే. కనీస వైద్య పరీక్షలకూ నోచుకోక కేజీహెచ్ లేదా ఇతర పెద్ద ఆస్పత్రులపై ఆధార పడాల్సిన పరిస్థితి. పీహెచ్‌సీల్లో సైతం అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తుంటారు. ఇక్కడ మాత్రం అవేవీ జరగవు. పెదవాల్తేరులోని ప్రభుత్వ ఈఎన్టీ ఆస్పత్రి పరిస్థితి ఇది. బోధనాస్పత్రిగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు గగనమనే చెప్పాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలకు సంబంధించిన కిట్లు సరఫరా చేసే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య పరీక్షల కిట్ల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో వైద్య పరీక్షల కోసం రోగులు ఇతర ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పనిచేయని యంత్రాలు..

ఈఎన్టీ ఆస్పత్రిలో కనీస వైద్య పరీక్షలు కూడా అందుబాటులో ఉండటం లేదు. పెద్ద పెద్ద రక్త పరీక్షలకు కేజీహెచ్‌కు లేదా ఇతర ఆస్పత్రులకు రోగులను పంపించారంటే పర్లేదు కానీ.. గ్రూపింగ్‌కు కూడా ఇతర ఆస్పత్రులపై ఆధారపడి ఉండటం ఈ ఆస్పత్రికే దక్కింది. హెమటాలజీ ఎనలైజర్, బయో కెమికల్ ఎనలైజర్ యంత్రాలు పనిచేయకపోవడంతో కేవలం సీబీసీ రక్త పరీక్షలు మినహా ఎల్ఎఫ్టీ, ఆర్ఎఫ్టీ మొదలైన రక్త పరీక్షలకు రోగులను కేజీహెచ్‌కు పంపిస్తున్నారు.

రిపోర్టు తెస్తేనే శస్త్రచికిత్స..

ఈఎన్టీ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయాలంటే ఇక్కట్లు తప్పవనే చెప్పాలి. ఇక్కడ ఆపరేషన్లకు అత్యంత కీలకమైన వైరల్ మార్క్ పరీక్షలు అందుబాటులో లేవు. దీంతో ఇతర ఆస్పత్రులకు వెళ్లి ఆ రిపోర్టులు తీసుకొస్తేనే రోగికి శస్త్రచికిత్స చేస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైరల్ మార్క్ పరీక్ష(హెచ్ఐవీ)లకు సంబంధించిన కిట్లు నిరంతరం సప్లై చేసేవారు. కూటమి ప్రభుత్వంలో వీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో వైరల్ మార్క్ వైద్య పరీక్షల నిమిత్తం కేజీహెచ్ లేదా ఇతర ఆస్పత్రికి రోగులను పంపుతున్నారు.

అన్ని స్కాన్లకు కేజీహెచ్‌కే..

ఈఎన్టీ ఆస్పత్రిలో ఒక్క ఎక్స్‌రే తప్ప.. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్లకు రోగులకు కేజీహెచ్చే దిక్కు. ఈఎన్టీలో చేసే చాలా శస్త్రచికిత్సలకు సీటీ, ఎంఆర్ఐ స్కాన్లు అవసరం. వీటి కోసం కేజీహెచ్ చుట్టూ రోజుల తరబడి రోగులు తిరగాల్సి వస్తుంది. కేజీహెచ్‌లో వందల సంఖ్యలో రోగులు ఈ స్కాన్ల కోసం ఎదురు చూస్తుంటారు. వారికి అదనంగా ఈఎన్టీ ఆస్పత్రి నుంచి కూడా రోగులు వెళ్లడంతో స్కానింగ్ జరగాలంటే వారం రోజుల సమయం పడుతుంది. దీంతో శస్త్రచికిత్స చాలా ఆలస్యమవుతుంది.

కూటమి ప్రభుత్వంలో కిట్ల సరఫరాలో నిర్లక్ష్యం..

రక్త పరీక్షలకు సంబంధించిన కిట్ల సరఫరాలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రస్తుతం తగినన్ని కిట్లు లేకపోవడంతో కేజీహెచ్‌కు వైద్య పరీక్షల నిమిత్తం రోగులను పంపిస్తున్నారు. ఈఎన్టీ ఆస్పత్రి ఉన్నతాధికారులు ఎంతో మొరపెట్టుకుంటే మూడు నెలల తరువాత చాలా తక్కువ మొత్తంలో సరఫరా చేసిన కిట్లు కూడా వేగంగా ఖాళీ అయ్యాయి. దీంతో ఎప్పటిలాగే మళ్లీ కేజీహెచ్‌కు రోగులను పంపుతున్నారు.

అందుబాటులో సిబ్బంది ఉన్నా..

రక్త పరీక్షలు చేసే సిబ్బంది ఈఎన్టీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ యంత్రాలు లేక.. ఉన్నవి సరిగ్గా పనిచేయక, కిట్లు సరఫరా కాకపోవడంతో రోగులను ఇతర ఆస్పత్రులకు పంపుతున్నట్లు పలువురు వైద్య సిబ్బంది చెబుతున్నారు. యంత్రాలను బాగు చేయాలని చాలా సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేదని సమాచారం.

స్కానింగ్ యంత్రం అవసరం..

పెదవాల్తేరులో ఈఎన్టీ, మానసిక, చెస్ట్, ఆర్‌సీడీ ఆస్పత్రులు ఉన్నాయి. ఈ నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రోగులను సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌కు కేజీహెచ్‌కు పంపిస్తుంటారు. ఈ ఆస్పత్రులకు ఒక స్కానింగ్ యంత్రం ప్రభుత్వం మంజూరు చేస్తే రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వైద్య పరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కు వెళ్లే అదనపు భారం కూడా తగ్గుతుంది. రోగులకు వేగంగా వైద్యం అందించేందుకు దోహదపడుతుందని, స్కానింగ్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పన్ను చెల్లింపుదారుల్లో పారదర్శకత


ఐఆర్ఎస్ అధికారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న కంకటాల మల్లికార్జునరావు

ఏయూ క్యాంపస్: పన్ను చెల్లింపుదారుల్లో పారదర్శకత పెంచేలా ప్రభుత్వం దృష్టి సారించి పనిచేస్తోందని ఐఆర్ఎస్ అధికారి పి.ఆనంద్‌కుమార్ అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ఏపీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం దసపల్లా హోటల్‌లో 'జీఎస్టీ ఆడిట్, సవరణలు, పన్నులు, నోటీలు ఎలా నిర్వహించాలి' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. జీఎస్టీ విధానాన్ని మరింత సరళతరం చేస్తూ ఇటీవల తీసుకున్న పలు నిర్ణయాలను వివరించారు. పన్ను చెల్లింపుదారుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్.కె.సంగు అసోసియేట్స్ వ్యవస్థాకుడు రామకృష్ణ సంగు మాట్లాడుతూ జీఎస్టీ చట్టాల్లో ఇటీవల వచ్చిన మార్పులను వివరించారు. చార్టెడ్ అకౌంటెంట్ సతీష్ సరఫ్ ఎగుమతులు, దిగుమతులు, వార్షిక ఆడిట్‌లో జీఎస్టీ సందేహాలకు బదులిచ్చారు. ఆషిష్ కుమార్ అగర్వాల్ అండ్ కో పార్ట్నర్ అశిష్ అగర్వాల్ రియలెస్టేట్ రంగానికి సంబంధించి జీఎస్టీ చట్టాలను వివరించారు. సదస్సుకు ఎఫ్ఏపీసీసీఐ అధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. జీఎస్టీ నిబంధనలపై ఎప్పటికప్పుడు వ్యాపారులు తెలుసుకోవాలని సూచించారు. ఇటువంటి సదస్సులతో అవగాహన కల్పించే దిశగా తాము పనిచేస్తామన్నారు. ఎఫ్ఏపీసీసీఐ ఉపాధ్యక్షుడు ఎ.సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు.

క్రీడలతో మానసిక వికాసం


క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ బాక్సింగ్ పోటీలు ప్రారంభిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: క్రీడలు యువతలో సానుకూల దృక్పథం, మానసిక స్థైర్యాన్ని పెంచేందుకు దోహదపడతాయని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ జిమ్నాజియంలో శుక్రవారం ఇంటర్ కాలేజీ యూత్ మెన్, ఉమెన్ బాక్సింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఏయూ బాక్సింగ్ రింగ్‌లో డాక్టర్ వి.ఎస్.కృష్ణ కళాశాల ఈ పోటీలు నిర్వహించింది. 109 మంది పురుషులు, 33 మంది మహిళా బాక్సర్లు ఏయూ అనుబంధ కళాశాల నుంచి పాల్గొన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల రెండు విభాగాల్లోను టీం చాంపియన్‌షిప్ గెలుచుకుంది. ఈ సందర్భంగా ఏయూ వీసీ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో అందిస్తున్న క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులను వీసీ పరిచయం చేసుకుని ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలల్లో నైతిక విలువలు అవసరం


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ మణిమాల

ఆరిలోవ: బాలల్లో నైతిక విలువలు అవసరమని ఐసీఐసీఐ బ్యాంక్ విశాఖ మేనేజర్ బి.మణిమాల అన్నారు. దీన్‌దయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో బాలల సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నైతిక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్‌తోపాటు ఆరిలోవ ఎస్ఐ సిహెచ్.రామునాయుడు తదితరులు పాల్గొని గృహంలో బాలురకు నైతిక విలువలు, జువైనల్ జస్టిస్‌పై అవగాహన కల్పించారు. బాలురు క్రమశిక్షణతో మెలగాలని, నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేరాలకు పాల్పడితే బాలుర భవిష్యత్ నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో బాలుర పరిశీలనా గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి


విద్యార్థులకు మొక్కల గురించి వివరిస్తున్న రామమూర్తి

బీచ్‌రోడ్డు: ఉక్కు నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు శుక్రవారం పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. వారికి పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అనేష్ మాథ్యూ, కవిత, రోసి మేరీ పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో బుక్ ఎగ్జిబిషన్


బుక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయ

మద్దిలపాలెం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాలలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయంలో లభ్యమయ్యే పుస్తకాలను సద్వినియో గం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల గ్రంథాలయాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, ఎకడమిక్ కో ఆర్డినేటర్ ఎస్.వి.రామారావు, పోలా ఉమామహేశ్వరరావు, వి.సూర్యనారాయణ, విజయ్ ప్రతాప్, సిహెచ్.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'తూర్పు' ఇన్‌చార్జిగా ప్రియాంక దండి

మద్దిలపాలెం: కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలు జారీ చేశారని ప్రియాంక దండి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా ఇన్‌చార్జి నూతన్ నాయుడు, పార్టీ పెద్దలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీచ్ రోడ్డులో వాహన తనిఖీలు



బీచ్ రోడ్డులో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహన చోదకులను ఆపి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రయాణంలో హెల్మెట్ ధారణ తప్పనిసరని, అది ధరించని వాహన చోదకులకు జరిమానా విధించి, తాత్కాలికంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వైభవంగా రాధాకృష్ణ మహోత్సవాలు


రాధాకృష్ణులను దర్శించుకుంటున్న మేయర్ దంపతులు, అక్కరమాని దంపతులు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని గోకుల్ పార్క్‌లో శుక్రవారం రాధాకృష్ణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి రోజున పాలు పెరుగు యదుమేళా నిర్వహిస్తారు. రాధాకృష్ణ మందిరంలో ఉదయం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ శ్రీభరత్, యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు, జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు భరణికాన రామారావు, సీతంరాజు సుధాకర్, ఉత్తరాంధ్ర యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని యాదవులంతా ఐక్యంగా రాధాకృష్ణ మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రాధాకృష్ణులను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక భజన బృందంతో నిర్విరామ భజనలు, మహిళల కోలాటం జరిపారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, వివిధ వార్డుల యాదవ కార్పొరేటర్లు, యాదవ సంక్షేమ సంఘం నాయకులు బొట్ట వెంకట రమణ, డాక్టర్ జి.రవికుమార్, గుమ్మడి నరసింగరావు, నక్క కనకరాజు, ఒమ్మిడి ఎల్లాజీ రావు, ఎడ్ల వేణుగోపాల్, ప్రసాదుల భాగ్యానంద్, పల్లా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల రహితంగా ఏయూ క్యాంపస్


మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని మత్తుపదార్థాల రహితంగా తీర్చిదిద్దుతున్నామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతను మత్తుపదార్థాలకు దూరంగా ఉంచడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏయూ క్యాంపస్‌లో పూర్తిస్థాయిలో నిఘా, పర్యవేక్షణ ఉంచామన్నారు. విద్యార్థుల భద్రత తమకు ఎంతో ప్రధానమని పేర్కొన్నారు. అధ్యాపకులు నిరంతరం విద్యార్థులతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను అర్థం చేసుకొని వారికి మార్గ నిర్దేశం చేస్తున్నారన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వారిలో ఒత్తిడిని తగ్గిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజ కుమారి, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య కె.రాంబాబు, ఆచార్య పాల్ డగ్లెస్, ఆచార్య అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

యోధులను స్మరించుకుందాం


మాట్లాడుతున్న గోనిపాటి ధర్మారావు

ఎంవీపీకాలనీ: ఉషోదయ కూడలిలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో శుక్రవారం జన్ జాతీయ గౌరవ్ దివస్ ఘనంగా నిర్వహించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఆయన చిత్రపటానికి ఇగ్నో ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధనలో అనాటి యోధులు చేసిన ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలను యువత స్మరించుకోవాలన్నారు. వారి స్ఫూర్తితో దేశాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా దేశంలోని అనేక గిరిజన జాతులు, వారి కళలు, గిరిజన పోరాట యోధుల చిత్రాలను కేంద్ర కార్యాలయంలో ప్రదర్శించారు. పలువురు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మేడా మస్తాన్‌రెడ్డి

ఎంవీపీకాలనీ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను రచయిత, సంఘ సంస్కర్త మేడా మస్తాన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పుస్తక విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. అనంతరం గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని గ్రంథాలయానికి ఆయన అందజేశారు. గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 16న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం, 18న చిత్రలేఖన పోటీలు, 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రచయిత నాంచారయ్య, పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనకు విశేష ఆదరణ


పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా లైబ్రరీలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. శుక్రవారం వందలాది మంది విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతోపాటు చారిత్రాత్మకమైన తాళపత్రాల గ్రంథాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రధాన లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధతీ సుకొని గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి


పెదగదిలి శివాలయంలో జ్వాలాతోరణ ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు


పాండరంగ స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


బీచ్ రోడ్డు ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు


పార్వతీముక్తేశ్వరాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు చేస్తున్న జీవీఎల్ తదితరులు


గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో బ్రహ్మణులకు స్వయంపాక దానాలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయాల్లో ఘనంగా పూజలు జరిగాయి. భక్తులు వేకువజాము నుంచి ఆలయాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలోని శివాలయాల్లో ఉపవాసాలతో మహిళలు శివ పూజలు చేశారు. నోములు ఉన్నవారు శివుడికి కార్తీక పౌర్ణమి పూజలు చేపట్టారు. డ్రైవర్స్ కాలనీ, పెదగదిలి, నెహ్రూనగర్, రవీంద్రనగర్, ఆరిలోవ కాలనీ, విశాలాక్షినగర్ ప్రాంతాల్లోని శివాలయాల్లో జ్వాలాతోరణ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని శివుడిని కొలిశారు.

బ్రహ్మణులకు స్వయంపాక దానం

మద్దిలపాలెం: కార్తీక పౌర్ణమి వేళ ఉదయం నుంచి ఉపవాసంతో భక్తులు పూజలు చేసి, సాయంత్రం ఇళ్లలో కేదారేశ్వరుని వ్రతం నిర్వహించిన అనంతరం ఆలయాలకు వెళ్లి బ్రాహ్మణులకు స్వయంపాక దానాలిచ్చారు. కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో భక్తులు బ్రాహ్మణులకు స్వయంపాక, దీప, లింగ దానాలు చేశారు.

జ్వాలాతోరణ మహోత్సవం

హెచ్‌బీ కాలనీ శివాలయంలో కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అభిమాలు, అర్చనలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలాతోరణ మహోత్సవం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పీతలవానిపాలెం శివాలయంలో జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహించారు.

కార్తీక దీపారాధన

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని పాండరంగ స్వామి ఆలయం, కిర్లంపూడి లేఅవుట్‌లోని లలిత సుందరేశ్వర పీఠంలో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. చినవాల్తేరు దుర్గామల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

జ్యోతిర్లింగాలకు అభిషేకాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని పార్వతీముక్తేశ్వర ఆలయంలో జ్యోతిర్లింగాలకు సామూహిక అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామిని దర్శించుకుని ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు చేశారు. వారికి ఆలయ కమిటీ ప్రతినిధులు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. భక్తుల దీపారాధన, క్షీరాభిషేకం, ఏకవారాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి బుచ్చిలింగం తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ అప్రెంటిస్ అభ్యర్థులకు ప్రయోగ పరీక్షలు

ఎంవీపీకాలనీ: ఏపీఎస్ ఆర్టీసీ విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని వివిధ డిపోల్లో ఐటీఐ అప్రెంటిస్ పూర్తిచేసిన అభ్యర్థులకు శుక్రవారం వాల్తేర్ డిపోలో ప్రయోగ పరీక్షలు, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. 63 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జోన్–1 డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎన్.అరుణకుమారి, మద్దిలపాలెం, గాజువాక, వాల్తేర్ డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమాలకు సరకుల అందజేత

ఎంవీపీకాలనీ: సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకొని స్థానిక శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆరిలోవలోని అమ్మ ఓల్డేజ్ హోమ్, ఆర్టీసీ కాంప్లెక్స్ దరి ఆశ్రమ హోమ్ ఫర్ ది హోమ్‌లెస్‌లకు నిత్యావసర సరకులు అందజేశారు. వృద్ధులకు చీరలు, దుప్పట్లు, టవళ్లతో కూడిన కిట్లు, పలు రకాల పండ్లు అందించారు. కార్యక్రమంలో విద్యావిహార్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

విశాఖ సిటీ: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సి.హెచ్.వి.మహేష్ కుమార్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బంది నగరంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో రామా టాకీస్ ప్రాంతంలోని అన్నా క్యాంటీన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరి వద్ద రెండు ప్యాకెట్లతో ఏడు కేజీల డ్రై గంజాయిని గుర్తించారు. ఈ కేసులో కేరళకు చెందిన వి.కె.అభిషేక్, ఎం.ఎం.సచిన్‌లను అరెస్టు చేసి తదుపరి విచారణ కోసం సీతమ్మధార ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. గంజాయిని సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్.రాజేశ్వరి, ఎస్.శ్రీనివాస్, ఎస్ఐలు ఎల్.అరుణకుమారి, పి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్యం



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కుమార్‌స్వామి

ఎంవీపీకాలనీ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగర వాసులంతా ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమార్‌స్వామి పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంవీపీ కాలనీ వీఎంసీ డిగ్రీ కళాశాలలో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన కళాశాల ఆవరణలో పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉసిరి, మారేడు, తులసి, వేప, మర్రి వంటి ఔషధ మొక్కలు పెంచడం ద్వారా మనిషి ఆరోగ్యానికి, కాలుష్య నివారణకు దోహదపడతాయన్నారు. ప్రతి పండగకు ఒక దేవతా వృక్షాన్ని నాటి పెంచడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై దుకాణాల తొలగింపులో గందరగోళం


చినవాల్తేరు - డిఫెన్స్ అపార్ట్‌మెంట్స్ మార్గంలో దుకాణాలు తొలగించేందుకు వచ్చిన జీవీఎంసీ వాహనాలు

ఏయూక్యాంపస్: చినవాల్తేరు కోటక్ స్కూల్ నుంచి పార్క్ హోటల్ మీదుగా డిఫెన్స్ అపార్ట్‌మెంట్స్ వరకు వెళ్లే మార్గంలో ఉన్న పదుల సంఖ్యలో తోపుడుబండ్ల దుకాణాలను తొలగించడానికి శుక్రవారం జీవీఎంసీ సిబ్బంది వచ్చారు. విషయం తెలుసుకున్న షాపుల యజమానులు వీటిని తొలగించడానికి వీల్లేదంటూ అడ్డం పడ్డారు. పోలీసులు సైతం అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఫుట్‌పాత్‌పై దుకాణాలు పెట్టడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని పలు ఫిర్యాదులు రావడంతో అధికారుల ఆదేశాలతో తొలగింపు ప్రక్రియ చేపట్టారు. షాపుల యజమానులకు మద్దతుగా కార్మిక సంఘాల ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. గోడకు దగ్గరగా తమ దుకాణాలు పెట్టుకుంటామని, వాటిని తెరవమని, తమకు కొంత సమయమివ్వాలని షాపుల యజమానులు విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది కోరగా.. కొద్దిసేపు చర్చల తరువాత దుకాణాల యజమానులు లేఖ రాసి వారికి ఇచ్చారు. దీంతో పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది అక్కడి నుంచి వెనుదిరిగారు.

చిరువ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలి

మద్దిలపాలెం: చినవాల్తేరు రైల్వే గెస్ట్‌హౌస్ ఆవరణలో 15 ఏళ్లుగా చిరువ్యాపారాలు నిర్వహిస్తున్న తోపుడుబండ్ల కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలని సీపీఎం కార్యదర్శి వి.కృష్ణారావు ఒక ప్రకటనలో కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎక్కడవారికి అక్కడే హాకర్ జోన్ ఏర్పాటు చేసి ఉపాధి రక్షణ కల్పించాలని చెప్పినా.. అమలు చేయడం లేదన్నారు. పైగా సోషల్ మీడియాలో అక్కడ తోపుడుబండ్లు తొలగించమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ట్యాగ్ చేశారని, అందుకు ఆయన వాటిని తొలగించండని చెప్పారని, ఇక్కడ జీవీఎంసీ అధికారులు పోలీసులను పెట్టి దుకాణాలు తొలగించడం అన్యాయమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి, టీడీపీ నేతలందరినీ ఈ దాడులు ఆపాలని డిమాండ్ చేస్తున్నానన్నారు.